జాతీయస్థాయి యోగా పోటీలకు
గంగారం పాఠశాల విద్యార్థిని



సుమతి

క్రికెట్ టోర్నమెంట్
విజేత ఖమ్మం జట్టు
ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు

7



తండాలు.. దండాలు

చెరగని సాంస్కృతిక సౌరభం.. గిరిపుత్రుల సంప్రదాయం

విభిన్నమైన ఆహార్యం, అలవాట్లు, సంస్కృతీసంప్రదాయాలు గిరిపుత్రుల సొంతం. అడవి తల్లిని నమ్ముకుని జీవించిన నాటి పరిస్థితుల నుంచి.. నేటి ఆధునిక సమాజంలోనూ తమ సంప్రదాయాలను చెక్కుచెదరనీయకుండా మారిన తరాలకు అందిస్తున్నారు గిరిజనులు. తండాలలో నివసిస్తూ సంస్కృతీ వైభవాన్ని కాపాడుకుంటున్న వారికి దండాలు పెట్టాల్సిందే.

- అక్కన్నపేట (ఆంధ్రజ్యోతి)

- విభిన్న వస్త్రధారణ.. కట్టు, బొట్టుతో మహిళలు
- గిరిజనుల స్పెషల్ వంటకాల రుచే వేరు
- సీత్లా, తీజ్ పండుగలు ప్రత్యేకం

ఉమ్మడి మెదక్ జిల్లాలో చెప్పుకోదగ్గ స్థాయిలో గిరిజన తండాలు ఉన్నాయి. అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఈ తండాలలో నివసిస్తూ తమ సంస్కృతీ వైభవాన్ని చాటుతున్నారు. వందమందిలో ఉన్నా గిరిజనులను గుర్తించేలా చేసేది వారి భిన్నమైన వస్త్రధారణ. వారి సంప్రదాయ దుస్తులు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. రంగురంగుల అద్దాలు పొదిగిన రవిక, దుప్పట్లాలు.. మణికట్టు నుంచి మోచేతిపై వరకు ధరించే మందపాటి తెల్లటి గాజులు, నాణెలు, అద్దాలతో తయారు చేసిన వస్త్రాన్ని తలపై నుంచి ధరించడం, పొడవాటి పెద్ద చెవి దుద్దులు, మెడలో వెండి హారం, గొలుసులు, కాళ్లకు ధరించే కడియాలు, గజ్జెలు వారి విభన్న వేషధారణను సూచిస్తుంది. వారు నడుస్తున్నప్పుడు చేసే వినసొంపైన శబ్దం.. సంప్రదాయ దుస్తుల్లో తమకే సొంతమైన జానపద పాటలకు వారు చేసే నృత్యం వారి సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. సీత్లా, తీజ్ ఉత్సవాల సమయంలో హోదాలను మరిచి అందరూ లంబాడి పదాలతో రచించిన అద్భుతమైన గీతాలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తుంటారు.

సీత్లా భవానీ ఉత్సవాలు

గిరిజనుల సంస్కృతికి ప్రతీకైన సీత్లా భవానీ పండుగను ప్రతీఏటా ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన పెద్ద పూసాల కార్తెలో మంగళవారం రోజున నిర్వహించుకోవడం తరాల నుంచి

మిగతా ఏడో పేజీలో





సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌మూర్తి

ఒత్తిడిని జయిద్దాం

- దేశంలోనే తొలిసారిగా ఐఐటీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం
- ఒక్కో వర్సిటీలో ఒక్కో విధానం

7

భవిష్యత్‌తరాలకు
వ్యవసాయం తప్పనిసరి

- విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యక్షుడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు

7

చదువుల ఖిల్లాగా 'ఖేడ్'

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐటీఐ ఏర్పాటుకు చర్యలు
- ఒకేచోట ఐదెకరాల్లో ఏర్పాటుకు స్థల పరిశీలన

8



కొల్చారం రైతు దీక్షలో హరీశ్‌రావుకు వరి కంకుల మాల వేసిన కార్యకర్తలు



నాగ్‌సాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

రైతు భరోసా ఇచ్చేవరకు రైతు దీక్షలు : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

కొల్చారం/కౌడిపల్లి/గుమ్మడిదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలైనా 6 గ్యారెంటీలు నెరవేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో శనివారం రైతుదీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరు హరికృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరి కంకులతో చేసిన హారాన్ని వేసి ఆహ్వానించారు. అంతకుముందు చిన్నఘనపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీక్షకు వచ్చే మార్గంలో కౌడిపల్లి మండల పరిధిలోని నాగ్‌సాన్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లడారు. అనంతరం దీక్షా శిబిరంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. 100 రోజుల్లో హామీలు నెరవేర్చుతామని రాష్ట్రంలో ఉన్న గుళ్లలో దేవుళ్లందరిపై ప్రమాణం చేశారని, ఏడాది దగ్గరపడుతున్నా నెరవేర్చలేదని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ నిలదీస్తేనే సగం రుణమాఫీ చేశారని, ఇంకా సగం చేయాల్సి ఉందని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా ఇంకా జమ చేయలేదని, డబ్బులు విడుదల చేసేవరకు దీక్షలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. వీరితో పాటు మాణిక్ రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, సుభాష్‌రెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, ఆంజనేయులు, గౌరీశంకర్, సంతోష్‌రావు, మేఘమాల సంతోష్, మంజుల, కాశీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రావు, రమేష్, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుగు ప్రయాణంలో హరీశ్‌రావు గుమ్మడిదల వద్ద ఆగి రైతులను కలిశారు. ఈ సందర్భంగా మండల రైతులు తమ సమస్యలను మాజీ మంత్రికి వివరించారు. అనంతరం పార్టీ నాయకుడు దుమ్మాల గోవర్ధన్‌రెడ్డి ఇంట్లో స్థానిక నాయకులతో సమావేశమై వివిధ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, నరసింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, సూర్యనారాయణ, వాసుదేవారెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

75 అంశాలపై ప్రశ్నలు

మెదక్ జిల్లాలో 2.20 లక్షలు, సంగారెడ్డి జిల్లాలో 4.1 లక్షల ఇళ్లలో సమగ్ర కుటుంబ సర్వే



మెదక్ పట్టణంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సమగ్ర కుటుంబ సర్వే శనివారం మెదక్ జిల్లాల్లో ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా మెదక్ జిల్లాలో 2.20 లక్షలో సర్వే చేసేందుకు 1,571 బ్లాక్‌లను ఏర్పాటు చేసి, 1,600 మంది ఎన్యూరేటర్లు, 170 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఈ నెల 6 నుంచి శనివారం మధ్యాహ్నం వరకు గృహాలకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియను ఎన్యూమరేటర్లు పూర్తిచేశారు. సర్వేలో భాగంగా 75 ప్రశ్నలతో కూడిన నమూనాలో వివరాలు సేకరించారు. సర్వే ప్రతంలో 75 కాలమ్స్ ఉన్నాయి. వాటన్నింటిని ఇంటికి వెళ్లి ఆ కుటుంబ యజమానితో పాటు మాట్లాడి నింపుతున్నారు. కొన్నిచోట్ల ఇంటి యజమానులు అందుబాటులో లేక పలుమార్లు తిరగాల్సి వచ్చింది. మెదక్ జిల్లాలో తొలిరోజు 5,693 ఇళ్లలో సర్వేను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

పూర్తి వివరాలు నమోదు చేయాలి

జిల్లావ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎలాంటి తప్పులకు తావులేకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎన్యూమరేటర్లను ఆదేశించారు. శనివారం మెదక్ పట్టణంలోని వెంకట్రావునగర్, హవేళీఘనపూర్ మండల పరిధిలోని కొత్తపలి గ్రామాల్లో పర్యటించి సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ప్రారంభమైన సర్వేలో తొలిరోజు వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో ముందస్తు దండోరా వేయించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు ఉన్నారు.

సంగారెడ్డి జిల్లాలో
ముమ్మరంగా సర్వే

సంగారెడ్డి టౌన్/కోహీర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో భాగంగా తొలిదశలో స్టిక్కర్లు అంటించే ప్రక్రియను సంగారెడ్డి జిల్లాలో పూర్తిచేశారు. శనివారం నుంచి ప్రధాన సర్వేను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 4,10,193 గృహాలు ఉండగా సర్వే కోసం 3,57,609 గృహాలకు స్టిక్కరింగ్ పూర్తిచేసినట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. సర్వే కోసం 3,426 మంది ఎన్యుమరేటర్లు, 375 మంది సూపర్‌వైజర్లను నియమించినట్టు వెల్లడించారు.

జిల్లాలోని కోహీర్‌లో సర్వే విధులకు గైర్హాజరైన ఐదుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందజేసినట్టు ఎంపీడీవో భారతి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. సర్వే విధులకు హాజరుకాని ఉపాధ్యాయులు సోహైల్‌అహ్మద్, అమీనాబేగం, అబ్దుల్‌అఖిల్, బాష్య, ఐకేపీ సీసీ సుధాకర్‌లకు జిల్లా కలెక్టర్ షోకోజ్ నోటీసులను జారీచేసినట్లు ఆమె వెల్లడించారు.



రాయిలపూర్ వద్ద హద్దులను గుర్తిస్తున్న సర్వే సిబ్బంది

'రింగ్ రైలు' కోసం సర్వే

50 మీటర్ల వెడల్పుతో స్థల సేకరణకు ప్రతిపాదన

కౌడిపల్లి మండలం రాయిలపూర్‌లో సర్వే

కౌడిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్‌రోడ్డు చుట్టూ రైలు మార్గం నిర్మాణం ప్రతిపాదనపై ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నది. ఇందులోభాగంగా మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని రాయిలపూర్ గ్రామ శివారులో రెండు నెలల క్రితం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన గుర్తు ఆధారంగా రెండు రోజులుగా అర్వీ డిజిటల్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నారు. శనివారం హెలీకాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. ట్రిపుల్‌ఆర్ అవతల గ్రామాల్లో ఆలయాలు, పాఠశాలలు, చెరువులు, నివాసాలు అటవీ ప్రాంతాలకు నష్టం వాటిల్లకుండా రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేస్తున్నట్టు సర్వే సిబ్బంది పేర్కొన్నారు. 50 మీటర్ల వెడల్పుతో సర్వే చేయాలని ఆదేశాలు ఉన్నాయని, ఏరియల్ పూర్తయిన అనంతరం ప్రభుత్వం వివరాలను వెల్లడించే అవకాశం ఉందని తెలిపారు.

ఈసారీ అంతేనా..!

- పదో తరగతి ప్రత్యేక తరగతులు ప్రారంభం
- విద్యార్థులకు స్నాక్స్ అందజేసేందుకు విరాళాల కోసం ఎదురుచూపులు



సంగారెడ్డిలోని స్పెషల్‌క్లాసుకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. కానీ, విద్యార్థుల ఆకలి తీర్చే ఏర్పాటుపై ఎటూ తేలడం లేదు. ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు మేలు జరుగుతుంది. పాస్ పర్సంటేజ్ పెరిగితే జిల్లా యంత్రాంగానికి కూడా పేరు వస్తుంది. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థుల ఆకలి తీర్చేందుకు స్నాక్స్ ఇచ్చేందుకు ప్రతీ ఏటా నిధుల కోసం అడుక్కోవాల్సి వస్తుండడంపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల 1 నుంచి స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. పాఠశాల ముగిసిన అనంతరం సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ఈ స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పాఠశాలకు వచ్చి సాయంత్రం 5.15 గంటల తర్వాత వెళుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని 239 ఉన్నత పాఠశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు స్పెషల్ క్లాసులకు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత సాయంత్రం వరకు బడిలో ఉండడం ఇబ్బందిగా మారి అల్పాహారం లేక విద్యార్థులు నీరసిస్తున్నారు. ఫలితంగా అర్థాకలితో ఏకాగ్రత నిలపలేకపోతున్న పరిస్థితి ఉన్నది. జనవరి నుంచి రెండు పూటల స్పెషల్ క్లాసుల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. అయితే స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం జిల్లా యంత్రాంగానికి సమస్యగా మారింది. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఈ స్పెషల్ క్లాస్‌లకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్‌గా ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున బిస్కెట్లు, పల్లిపట్టి, అరటి పండ్లు, ఇతర పండ్లు, మిక్చర్ వంటి ఏదైనా ఇచ్చేవారు. రెండేళ్ల క్రితం వరకు స్నాక్స్ కోసం అప్పటి జిల్లా కలెక్టర్ నిధులు సమకూర్చారు. గతేడాది నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన జిల్లా యంత్రాంగం వెనక్కి తగ్గడంతో పలువురు ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు ఖర్చు చేసి స్నాక్స్ ఇచ్చారు. స్పెషల్ క్లాసులు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా విద్యార్థులకు స్నాక్స్ విషయంలో ఇటు జిల్లా విద్యాశాఖ, అటు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీనిపై విద్యార్థులు, ఉపాధ్యాయవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులివ్వకపోతే పిల్లలకు ఇబ్బంది లేకుండా దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు సిద్ధమవుతున్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల సమాచార సేకరణ

- ఉమ్మడి జిల్లాలో 292 మంది..
- వెరిఫికేషన్‌కు 183 మంది హాజరు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2008 బీఈడీ అభ్యర్థులకు సంబంధించి సమాచార సేకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల సమగ్ర వివరాలు సేకరించిన అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పంపారు. డీఎస్సీ-2008 బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాలు చేపడుతామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత నెల 5వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో డీఎస్సీ-2008 పరీక్ష రాసి, 70:30 రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన అభ్యర్థులు 292 మంది ఉన్నారు. వీరిలో 183 మంది మాత్రమే వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. త్వరలో వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి కాంట్రాక్టు టీచర్లుగా పోస్టింగ్ ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను జిల్లా అబ్జర్వర్‌గా ఉన్న ఆర్జేడీ విజయలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.



చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి వేకువజామున చైర్మన్ ఆంజనేయ శర్మ, పూజారి దత్తుశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, నిత్యపూజలు, మాధవానంద సరస్వతి స్వామిచే ప్రత్యేకపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు.

-శివ్వంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

నర్సాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించి, కొనుగోలు తీరును పరిశీలించారు.

యువకుడి వేధింపులు భరించలేక

వివాహిత ఆత్మహత్య



ప్రియాంక మృతదేహం

మర్కుక్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివాహితను ఓ యువకుడు వేధించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవెల్లిలో శనివారం జరిగింది. మర్కుక్ ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రియాంకకు ఎర్రవెల్లికి చెందిన రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు అరణ్య(2), భవ్యశ్రీ(5నెలలు) ఉన్నారు. కొంతకాలంగా వివాహితను అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్(32) వేధిస్తున్నాడు. అసభ్యకరంగా మెసేజ్‌లు చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేని బాధితురాలు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గతంలోనూ ఇలాగే వేధించగా, పలుమార్లు హెచ్చరించినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నందిని

వెల్దుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వెల్దుర్తి మండల పరిధిలోని మనేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నందిని ఎంపికైంది. శనివారం చేగుంటలో అండర్-14 బాలికల విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ పోటీలు జరిగాయి. ఇందులో నందిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య తెలిపారు.

క్రైం కార్నర్

పనిచోట వేధింపులు.. వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పనిచేసే చోట వేధింపులకు గురిచేయడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండల పరిధిలోని తిమ్మాపూర్ కుషాన్‌గడ్డతండా సమీపంలోని శుభంకరి గోశాలలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం... తండాకు చెందిన మడావత్ లల్యా(44) గ్రామ శివారులోని శుభంకరి గోశాలలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా నెలరోజుల క్రితం లల్యాను పనిలోంచి తీసేశారు. లల్యా కుటుంబసభ్యుల సూచనలతో వారం క్రితం మళ్లీ పనిలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి గోశాల యజమానితో పాటు సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని లల్యా కుటుంబీకులతో వాపోయాడు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి అన్నం తిని గోశాలకు వెళ్లాడు. శనివారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా గోశాల సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


మల్లేశంగౌడ్ (ఫైల్)

తొగుట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన తొగుట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చిలివేరి మల్లేశంగౌడ్(55) కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి గ్రామంలో ఎకరన్నర భూమి ఉండగా.. మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైంది. దాంతో తీవ్ర మనోవేదనకు గురైన మల్లేశంగౌడ్ కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై ఇటీవలే కోలుకున్నాడు. దీంతో కులవృత్తిని చేసుకుంటున్నాడు. శనివారం ఈత చెట్టుకు కల్లు తీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మోకు ఊడిపోవడంతో చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించిన చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు కుమారులు హరీశ్, రాజు, కిశోర్ ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు హరీశ్‌కు వివాహం జరిగింది. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని గ్రామస్థులు కోరారు.

డీసీఎం బోల్తా, ఏడుగురు కూలీలకు గాయాలు

● బొమ్మారం సీడ్ కంపెనీ వద్ద ఘటన

మాసాయిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం బోల్తాపడి ఏడుగురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారం సీడ్ కంపెనీ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన కూలీలు బొమ్మారంలోని ఓ సీడ్ పరిశ్రమలో పనిచేసేందుకు డీసీఎంలో వెళ్తున్నారు. సమీపంలోని గట్టు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కూలీలు రోషన్, ముకేష్‌కుమార్, మంచ్‌రాం, సంజయ్‌రాం, ఫాజల్, దీపక్, లాల్‌బాగ్ గాయపడ్డారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం పరిశ్రమవారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని స్టాల్

హ్యాండీక్రాఫ్ట్‌లతో మానసికోల్లాసం

ప్రతిరోజూ చూసే చెక్కతో తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్ లతో మా యూనివర్సిటీ విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగిస్తున్నాం. ఈ హ్యాండీక్రాఫ్ట్‌లతో చేసిన గిలకలతో కాళ్లు, చేతులు, పాదాలు, శరీర కండరాలు, తల, వీపుపై మర్దన చేస్తూ ఒత్తిడి పోగొడుతున్నాం.

- కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు


ఐఐటీహెచ్‌లో వెల్‌బీయింగ్ సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి


సన్‌షైన్ కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు

సన్‌షైన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం

ఐఐటీహెచ్‌లో సన్‌షైన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాం. ఇందులో భాగంగా ప్రతి క్లాస్ రూమ్‌లో ఒక వాలంటర్ ప్రతీ విద్యార్థిని గమనిస్తారు. విద్యార్థులు సమయానికి క్లాసుకు రాకపోయినా, భోజనం సరిగా చేయకపోయినా వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికి ముగ్గురు సైకలాజికల్ కౌన్సిలర్లను నియమించారు. దీంతో ప్రతి విద్యార్థి ఒత్తిడిని అధిగమించి మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు.

- ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు

ఒత్తిడిని జయిద్దాం

● దేశంలోని తొలిసారిగా ఒత్తిడి లేని విద్యపై ప్రత్యేక కార్యక్రమం
● ఒక్కో వర్సిటీలో ఒక్కో విధానం
● దేశ నలుమూలల నుంచి 100కు పైగా విద్యాసంస్థలు హాజరు

కంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడిని తట్టుకుని భవిష్యత్‌కు చక్కటి బాటలు వేసుకునేందుకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ శనివారం వేదికగా మారింది. దేశంలోనే తొలిసారిగా ఐఐటీహెచ్ ప్రాంగణంలో ఒత్తిడి లేని విద్య, మానసిక ఒత్తిడి నిర్వహణపై జాతీయ సదస్సు నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి కే.సంజయ్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో దేశ నలుమూలల నుంచి 100కు పైగా విద్యాసంస్థలు పాల్గొన్నాయి. తమ విద్యాసంస్థల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారు చేపడుతున్న వివిధ రకాల పద్ధతులు, అవలంబిస్తున్న విధానాలు ఐఐటీహెచ్ ప్రాంగణంలో స్టాళ్లరూపంలో ప్రదర్శించారు. మానసిక వికాసం పెంపొందించుకుని ఒత్తిడిని తగ్గించుకునేందుకు చక్కటి నిద్ర, సమతూల్య ఆహార పద్ధతులు, మాట్లాడే విధానం, ప్రకృతిని ఆస్వాదిస్తూ నడక, సరైన విశ్రాంతి అవసరమని మానసిక నిపుణులు తెలిపారు. వీటితో పాటే ఆయా విద్యాసంస్థల్లో యోగా, ధ్యానం, నృత్యాలు, పెయింటింగ్, సంగీతం, సామాజిక అంశాలపై చర్చలు, వ్యాయామాలు, ఆటలతో ఒత్తిడిని తగ్గించి మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు.

యోగాసనాలతో ఒత్తిడిని అధిగమిస్తున్నాం


ఒత్తిడి నిర్వహణను వివరిస్తున్న నేషనల్ సంస్కృట్ యూనివర్సిటీ, తిరుపతి అధ్యాపకులు

దినచర్యలో భాగంగా మా విద్యాలయాల్లో విద్యార్థులకు ప్రతీరోజు యోగాసనాలు వేయిస్తున్నాం. దీంతోపాటే ధ్యానం చేయడం అలవాటు చేశాం. వివిధ రకాల ఆటల్లో, సంగీతంలో, పురాతన ఇతిహాసల నాటకాలు వేయడంలో నైపుణ్యం పెంపొందిస్తున్నాం. ఫిజికల్ యాక్టివిటీస్ ద్వారానే ఎక్కుగా విద్యార్థులకు ఒత్తిడి తగ్గుతుందని గుర్తించాం. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవడానికి సహకరిస్తున్నాం.

- నేషనల్ సంస్క్రిట్ యూనివర్సిటీ, తిరుపతి అధ్యాపకులు

జీవన విధానంపై శిక్షణ


మానసిక వికాసంపై పద్ధతులను తెలుపుతున్న నాగాలండ్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్లు

మా రాష్ట్రంలో ఎక్కువగా పచ్చని అడవులు ఉంటాయి. దాదాపు 16 తెగలు ఉన్నాయి. మా యూనివర్సిటీలో చదివే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అటవీ ప్రాంత జీవన విధానంపై శిక్షణ ఇస్తున్నాం. వెదురు బొంగులతో బుట్టలు అల్లించడం, చేతి వస్తువులు, బొమ్మలు తయారు చేయిస్తున్నాం. ఇక్కడ ప్రసిద్ధి చెందిన రాక్‌బ్యాండ్ మ్యూజిక్ నేర్పిస్తున్నాం. మరికొందరికి వయోలిన్, మృదంగం, యోగా, నాగా క్రాఫ్ట్ తయారీలో మెళకువలు నేర్పించాం. క్లాస్ కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తున్నాం.

- నాగాలండ్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్లు


జుంబా డ్యాన్స్ గురించి వివరిస్తున్న దృశ్యం

జుంబా డ్యాన్స్ నేర్పిస్తే ఒత్తిడి మాయం

మా యూనివర్సిటీలో ఎవరైన డిప్రెషన్‌గా అనిపిస్తే వారికి జుంబా డ్యాన్స్ నేర్పిస్తాం. జుంబా డ్యాన్స్ చేస్తే ఒత్తిడి కచ్చితంగా దూరం అవుతుందని గుర్తించాం. అంతేగాక హ్యాప్పీనెస్ సీజన్ పేరిట కార్యక్రమాలు, చర్చలు, యోగా, ధ్యానంతో విద్యార్థుల్లో ఒత్తిడి దూరం చేస్తున్నాం. ఒంటరిగా గడిపే విద్యార్థులకు మానసిక వికాస నిపుణులచే ప్రత్యేక కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నాం.

- ఐఐఎం జమ్మూ-కాశ్మీర్ ప్రొఫెసర్లు


ఖమ్మం జట్టుతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, రాజేందర్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఖమ్మం జట్టు

● ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు

కొండాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్‌లో నాలుగురోజులుగా హోరాహోరీగా జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టు ఫైనల్ విజేతగా నిలిచింది. చివరి రోజు శనివారం ఎంఎ క్రికెట్ గ్రౌండ్‌లో ఖమ్మం జిల్లా, ఆదిలాబాద్ జిల్లా జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 50 ఓవర్లలో 336 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 43.1 ఓవర్లలో 262 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 75 పరుగుల తేడాతో ఖమ్మం జిల్లా జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతి జిల్లాకు సొంత క్రీడా మైదానం కొనుగోలు చేయడం లేదా లీజు గ్రౌండ్ అయినా సమకూర్చడానికి నిధులు వెచ్చిస్తామని తెలిపారు. అనంతరం విజేత ఖమ్మం జట్టుకు ట్రోఫీ, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆగమరావు, వరంగల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రదీప్, సభ్యులు అంజయ్య, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమౌళి, రఘుపతి, విజయ్, అనిల్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

● ఎస్జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి రమేష్


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

చేగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని ఎస్జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి గంగాల రమేష్ అన్నారు. శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 బాల, బాలికల వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలు చేగుంట ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమస్థానం మెదక్, ద్వితీయస్థానం సంగారెడ్డి, తృతీయస్థానం సిద్దిపేట కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమస్థానం సిద్దిపేట, ద్వితీయస్థానం సంగారెడ్డి, తృతీయస్థానం మెదక్ కైవసం చేసుకున్నట్లు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా నుంచి వివిధ క్రీడా పోటీల్లో చాలామంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు ఈనెల 16, 17వ తేదీల్లో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచి మెదక్ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అల్లి నరేష్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, మెదక్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, నాగరాజు, శంకర్, శ్రీను, ప్రవీణ్, నరేష్, శారద, మిధున పాల్గొన్నారు.


భవిష్యత్‌తరాలకు వ్యవసాయం తప్పనిసరి

● విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యక్షుడు, సినీ నిర్మాత సురేష్‌బాబు


తునికిలోని విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న సురేష్‌బాబు


కౌడిపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 9: భవిష్యత్‌తరాలకు వ్యవసాయం తప్పనిసరి అని విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యక్షుడు, సినీ నిర్మాత సురేష్‌బాబు సూచించారు. శనివారం మండల పరిధి తునికిలోని విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థల పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 2004లో గ్రామీణ పేద విద్యార్థుల కోసం రామానాయుడు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కళాశాలలో శిక్షణ పొందిన 300ల మంది విద్యార్థులు ఏటేటా వేలుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గతంలో ఇక్కడ చదివిన 500ల మంది విద్యార్థులు ఒకేచోట కలుసుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రాంప్రసాద్, డైరెక్టర్ కెన్.రాము, మాజీ డైరెక్టర్ డీఎస్.రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండ


ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మత్స్య సహకార సంఘాల సమైఖ్య రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మత్స్యకారులకు చేయూతనందిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6,153 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని, ఇందులో 40 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 2018 నుంచి 2023 వరకు రాష్ట్రవ్యాప్తంగా 571 మంది మృతిచెందినా ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదన్నారు. త్వరలో మహిళా మత్స్యకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు మాజీద్, హన్మాండ్లు, సద్దాం, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు వినయ్, సుమతి


వినయ్

సిద్దిపేట కల్చరల్/కొండాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యోగాసన భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే 5వ జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి సిద్దిపేట పట్టణానికి చెందిన వినయ్(యోగా క్రీడాకారుడు) ప్రాతినిధ్యం వహించనున్నాడు. అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా 11 నుంచి 14 వరకు ట్రెడిషనల్ యోగా విభాగంలో 10 నుంచి 14 ఏళ్ల వయస్సు వాళ్లు పాల్గొనే పోటీల్లో వినయ్ పాల్గొంటాడని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతనెలలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వినయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. కొండాపూర్ మండల పరిధిలోని గంగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమతి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పండరినాయక్ తెలిపారు.

12న ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 12న కొల్లూరులోని ది-గాడియం స్కూల్‌లో ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ అమూల్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలుర, బాలికలు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9000609038 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

తండాలు.. దండాలు

చెరగని సాంస్కృతిక సౌరభం.. గిరిపుత్రుల సంప్రదాయం

సండే స్పెషల్

ఐదో పేజీ తరువాయి

వస్తున్న ఆనవాయితీ. గిరిజనుల పశుసంపద రక్షణకు, వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని పూర్వం నుంచి జరుపుతున్నారు. తండా చివరలో ఏడుగురు అక్కాచెల్లెళ్లయిన (తుల్జా భవానీ, దుర్గా భవానీ, హింగ్లా భవానీ, అంబ భవానీ, గండి భవానీ, మత్రా భవానీ, సీత్లా భవానీ) దేవతల ప్రతిమలను పొడవాటి రాళ్లతో తయారు చేసి ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ఏడుగురు అమ్మవార్లలో చిన్నదైనా సీత్లా భవానీ పేరిట పండుగ నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గిరిజనులు గొర్రెపోతులు, మేకలను బలి ఇచ్చేటప్పుడు వచ్చే రక్తం, ఉడకబెట్టిన గుడాలు కలిపి ప్రత్యేక పదార్థం తయారుచేస్తారు. బలి ఇచ్చిన గొర్రె, మేకల పేగులను దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి పశువులను దాటిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన పదార్థాన్ని పశువులపై చల్లుతారు. ఇలా దీన్ని దాటుడు పండుగగా పరిగణిస్తారు. ఆషాఢ మాసంలో ఒక్కొక్క మంగళవారం ఒక్కొక్క తండాలో సీత్లా భవానీ పండుగను నిర్వహిస్తారు.


సీత్లా భవానీ అమ్మవారికి పూజాలు చేస్తున్న గిరిజనులు

తొమ్మిది రోజుల తీజ్

పెళ్లికాని అమ్మాయిలు మట్టిలో విత్తనాలు నాటి, భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటూ జరుపుకునే పండుగే తీజ్. మట్టిలో నాటిన విత్తనాలకు నీటిని పోస్తూ.. తొమ్మిది రోజులపాటూ నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు చేస్తారు. తొమ్మిది రోజుల తర్వాత మొలకెత్తిన విత్తనాలను చేతితో తలపైన ఎత్తుకొని, ఊరేగింపుగా డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ.. గ్రామ శివారులో ఉండే చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆచారాలను మరువకుండా పద్ధతిగా పాటిస్తుంటారు. తండాలల్లో ఉంటున్న కుటుంబాల పిల్లలు ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ తీజ్ పండుగ వచ్చిందంటే మాత్రం వారివారి స్వస్థలాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకుంటున్నారు.


తండాలో ఆరుబయట రొట్టే చేస్తున్న గిరిజన మహిళ


జొన్నరొట్టెపై సోలాయి వంటకం

గిరిజనుల స్పెషల్ సోలాయి

గిరిజనులు శారీరక దృఢత్వం కోసం ప్రతీ పండుగకు సోలాయి, కార్‌బోటి వంటకాలు చేసుకుని తింటారు. పండగలకు తండాల్లో గొర్రెలు, మేకలు బలిచ్చినప్పుడు రక్తాన్ని ఒక గిన్నెలో పట్టి అందులో చింతపండు, ఉప్పు కలిపి నానబెడతారు. తర్వాత మాసంలోని మెత్తటి ముక్కలు తీసి నీళ్లు పోయకుండా ఉడకబెడతారు. మాంసం ఉడికిన తర్వాత రక్తంతో చేసిన చింతపండు మిశ్రమాన్ని మాంసంలో వేసి ఉడికించడంతో వంటకం తయారవుతుంది. దీన్ని ఆహారంగా తీసుకునేందుకు గిరిజనులు ఆసక్తి చూపిస్తారు. ఎలాంటి మసాలాలు, నూనె, నీళ్లు లేకుండా చేసిన సోలాయి వంటకాన్ని తినడం ద్వారా ఒంటికి బలం చేకూరుతుందని వారి నమ్మకం. అలాగే నూనె, నీళ్లు లేకుండా పసుపు, ఉప్పు కలిపి మటన్, చికెన్‌తో కార్‌బోటి వంటకం చేసుకుని తింటారు.

జొన్న రొట్టె, ఎల్లిపాయ మిరం

గిరిజనులకు ఆనాటి కాలంలో వంట నూనెలు అడవిలో లభించకపోవడంతో దొరికిన ఆకుకూరలు, పుట్టగొడుగులను సేకరించి కూర వండుకుని జొన్న రొట్టెలకు అద్దుకొని తినేవారు. అలాగే జొన్న రొట్టె, ఎల్లిపాయ మిరం గిరిజనులు ఇష్టంగా తీసుకుంటారు. గిరిజనులు ఆహారం కోసం ఎక్కువగా జొన్న పంటను సాగు చేస్తున్నారు. వానాకాలం, ఎండాకాలంలో గిరిజనులు ఎక్కువగా చేపల పులుసు చేసుకుని మక్క, జొన్న గడకను ఆహారంగా తీసుకుంటారు. వ్యవసాయ, కూలీల పనులు ముగించుకొని దగ్గరలోని కుంటలు, చెరువులలో వేటకు వెళ్లి చేపలు పడుతుంటారు. దీంతో కూర వండుకుంటారు. మిగిలిన చేపలను ఎండబెట్టుకుని వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు కూరలకు వాడుకుంటారు.

చదువుల ఖిల్లాగా ఖేడ్

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గం విద్యారంగంలో దూసుకుపోయేందుకు సిద్ధమైంది. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్‌లో వృత్తి విద్య నైపుణ్యాన్నిపెంపొందించేందుకు ఐటీఐ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే నారాయణఖేడ్‌లో మోడల్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయడానికి తోడు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటుకు కూడా భూమి పూజ చేశారు.

జూక్కల్ శివారులో స్థలపరిశీలన

మారుమూల ప్రాంతం కావడంతో పాటు పేదరికం కారణంగా చాలా మంది విద్యార్థులు ఇంతకాలం ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదుకునే స్తోమత లేక మధ్యలోనే చాలించేశారు. ఈ ప్రాంతంలో ఐటీఐ ఉంటే టెక్నికల్ కోర్సులు చదివి ఎలాగోలా స్థిరపడాలన్న పేద విద్యార్థుల కల చాలా ఏళ్లుగా నెరవేరడం లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఐటీఐ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఐటీఐ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఇందు కోసం ఇటీవలే జూక్కల్‌శివారులో స్థలాన్ని పరిశీలించారు. అక్కడే స్కిల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయించేందుకు చర్యలు చేపడుతున్నారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి శిక్షణాశాఖ చర్యలు చేపట్టింది. ఖేడ్‌లో కొత్తగా ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని పరిశీలించి వెంటనే నివేదిక సమర్పించాలని సంబంధిత రీజినల్ డిప్యూటీడైరెక్టర్ పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌ను ఎన్.శ్రీనివాస్‌ను ఆదేశించారు. దీంతో ఆయన ఖేడ్ ఎమ్మెల్యే, ఆర్డీవోతో కలిసి జూక్కల్ శివారులో అనువైన 2.20 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.



ఖేడ్‌లో ఐటీఐ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీవో, అధికారులు (ఫైల్)

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐటీఐ ఏర్పాటుకు చర్యలు
- ఐటీఐలో తొలుత 5 ట్రేడ్‌లకు ప్రతిపాదనలు
- రెండూ ఒకేచోట ఉండేలా 5 ఎకరాల్లో ఏర్పాటుకు స్థలపరిశీలన
- సీఎం టేబుల్‌పై ఫైల్

నివేదిక సమర్పించాం

- ఎన్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఐటీఐ పటాన్ చెరు

రాష్ట్ర ఉపాధి మరియు శిక్షణశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఖేడ్‌లో 2.20 ఎకరాల స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి ఐటీఐ ఏర్పాటుకు నివేదించాం. ఐదు కోర్సులను ప్రతిపాదించాం. ఐటీఐ ఏర్పాటు అయ్యాక ఏటీసీ కోర్సులు ప్రారంభమవుతాయి.

ఐటీఐ సమీపంలోనే రూ.10 కోట్లతో ఏర్పాటు చేయనున్న స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌కు సైతం రెండున్నర ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

ఐదు కోర్సులతో ప్రారంభం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు కోర్సులతో ఐటీఐ ప్రారంభం కానుంది. ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వెల్డర్, సోలార్ టెక్నాలజీ, బాలికల కోసం ఫ్యాషన్ డిజైన్, అండ్ టెక్నాలజీ కోర్సులను ఏర్పాటు ప్రతిపాదించారు. బాల, బాలికలు ఐటీఐ కోర్సులు చదువుకునేలా అనువైన కోర్సులను ప్రతిపాదించారు. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటవుతున్నందున అత్యధికంగా ఉద్యోగావకాశాలు పొందేలా ఉండేందుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

డిమాండ్‌ను బట్టి ఏటీసీ కోర్సులు కూడా..

ఐటీఐ ప్రారంభించాక విద్యార్థుల ఆసక్తి, డిమాండ్ మేరకు ఏటీసీ కోర్సులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఏటీసీలో ఏడాది కాలపరిమితితో మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇంటస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీజం యూసింగ్అడ్వాన్స్ టూల్‌సెక్టార్ క్యాపిటల్‌గూడ్స్ అండ మాన్యుఫ్యాక్చరింగ్, రెండేళ్ల కాలపరిమితితో బేసిక్ డిసిగ్రేర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ సెక్టార్ - క్యాపిటల్ గూడ్‌సాండ్ మాన్యుఫ్యాక్చరింగ్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సులను సైతం ప్రవేశ పెట్టనున్నారు.

సాంకేతిక విద్యకు దోహదం



ఐటీఐ ఏర్పాటుతో నూతన సాంకేతిక విద్యను నేర్చుకొని ఉపాధి అవకాశాలు మెరుగయ్యే అవకాశం ఉంటుంది. ఐటీఐలో ఈ ప్రాంత విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగపడేలా కోర్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం ఎంతో సంతృప్తినిస్తున్నది.

- సున్నపు వెంకట్, నిరుద్యోగి, నారాయణఖేడ్

త్వరలో ఉత్తర్వులు



ఐటీఐ ఏర్పాటుకు సంబంధించిన నివేదిక సిద్ధం చేసి సీఎంకు సమర్పించడమైంది. త్వరలో మంజూరు ఉత్తర్వులు రానున్నాయి. ఐటీఐ ఏర్పాటుకు ఇప్పటికే సీఎం హామీ ఇవ్వడమే కాకుండా ఏర్పాటుకు సుముఖంగా ఉన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థుల కోరిక నెరవేరుస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. విద్యారంగంలో ఖేడ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తాం.

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్

50కి బదులుగా 32 కేజీల రేషన్ బియ్యం



తూకంలో 32 కిలోలు ఉన్న బియ్యం సంచి

నాగల్‌గిద్ద, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కారాముంగి గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం సంచిని తూకం వేయగా 50 కేజీలకు బదులుగా 32కిలోల 700 గ్రాములు తూగింది. దీంతో స్థానిక డీలర్‌తో పాటు ప్రజలు ఆశ్చర్యపోయారు. అధికారులు స్పందించి బియ్యంలో కోత రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పల్లె వెలుగు బస్సు... ఎక్స్‌ప్రెస్ సర్వీస్

- ఇదేం చోద్యమంటూ ప్రయాణికుల అసహనం



ఎక్స్‌ప్రెస్ బోర్డుతో నడుపుతున్న పల్లెవెలుగు బస్సు

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నడపాల్సిన పల్లె వెలుగు బస్సులను గ్రామాలకు నడపకుండా ఖేడ్ ఆర్టీసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ బోర్డు పెట్టి ఎక్స్‌ప్రెస్ సర్వీసుగా నడుపుతున్నారు. నారాయణఖేడ్ డిపోలో అసలే పల్లె వెలుగు బస్సులు అంతంత మాత్రంగా ఉంటే ఇటీవల డిపోకు రెండు కొత్త పల్లె వెలుగు బస్సులు రావడంతో, వాటిని గ్రామీణ ప్రాంతాల రూట్లలో నడుపాల్సి ఉన్నప్పటికీ, ఎక్స్‌ప్రెస్ బోర్డు ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు నడుపుతున్నారు. పల్లెవెలుగు బస్సును ఎక్స్‌ప్రెస్‌గా నడుపడంపట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలనే ఆలోచనతో విద్యాసంస్థల్లోనూ సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బోజిరెడ్డి, మారుతిరెడ్డి, జీవన్, మోయిన్‌పటేల్, గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాలసదనంలో జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం



సంగారెడ్డిలోని బాలసదనంలో చిన్నారులతో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని బాలసదనంలో చిన్నారుల సమక్షంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవాన్ని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవలు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లర్నింగ్ టెక్నాలజీ ప్రోగ్రాంకు 5 పాఠశాలలు ఎంపిక

చిన్న శంకరంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేఘశాల ట్రస్టు బెంగళూరు ఆధ్వర్యంలో లర్నింగ్ టెక్నాలజీ ప్రోగ్రాంకు చిన్నశంకరంపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ సూరారం, మిర్జాపల్లి, ధర్పల్లి, అప్పర్ ప్రైమరీ స్కూల్ జంగరాయి, టి. మాందాపూర్ పాఠశాలలు ఎంపికైనట్లు మండల విద్యాధికారి పుష్పవేణి శనివారం ప్రకటనలో తెలిపారు.

అల్లాదుర్గంలో బస్‌లు ఆపడం లేదని డీఎంలకు ఫిర్యాదు

అల్లాదుర్గం, నవంబరు 9.(ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గంలోని ప్రధాన బస్టాప్‌ల వద్ద బస్సులు ఆపడం లేదని ఆరోపిస్తూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు నారాయణఖేడ్, సంగారెడ్డి, హైదరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేశారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న నేపథ్యంలో ఆయా ఆర్టీసీ డిపోలకు చెందిన కొందరు ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధానంగా అల్లాదుర్గం ఐబీ చౌరస్తా, అల్లాదుర్గం ప్రధాన రహదారి వద్ద గల బస్‌స్టాపుల్లో బస్సులు ఆపకుండా వెళ్తుండటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి అల్లాదుర్గం, చిల్వెర్ ఐబీ చౌరస్తా వద్ద బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పశుగ్రాసం విత్తనాల పంపిణీ

టేక్మాల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివా రం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాసం విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

రామాయంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి: పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పుట్టి సందీప్ 30మంది పేద వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్ చేయించారు. కంటి చూపు మందగించిన వారిని గుర్తించి జిల్లా కేంద్రమైన కామారెడ్డికి తన సొంత వాహనంలో తీసుకెళ్లి చికిత్సలు జరిపించాడు. శనివారం సందీప్ మాట్లాడుతూ త్వరలోనే ఇదే వార్డులో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తానన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

చిన్న శంకరంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ శశిధర్ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

టేక్మాల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం టేక్మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని, ఈకుబేర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపులు జరగాలని కోరారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కు సన్మానం

రాయికోడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నూతన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గొల్ల అంజయ్య పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం రాయికోడ్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం స్థానిక శ్రీపాండురంగేశ్వర ఆలయం, శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయాల్లో అంజయ్య ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఓటరు నమోదు సక్రమంగా చేపట్టాలి



రామాయంపేట పోలింగ్‌బూత్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

జహీరాబాద్, నవంబరు 9: పద్దెనిమిది ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాయిపల్లి(డి), పట్టణంలోని రంజోల్ గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటరుజాబితా సవరణ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతున్నందున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

- కోహీర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కోహీర్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలు చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ బాలశంకర్ పరిశీలించారు. బీఎల్‌వోలు జాగ్రత్తగా ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు.కార్యక్రమంలో డీటీ ప్రసాద్ ఉన్నారు.
- రామాయంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ ఆర్డీవో రమాదేవి తహసీల్దార్ రజనితో కలిసి శనివారం పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని సూచించారు.
- నర్సాపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు కోసం నర్సాపూర్ మండలంలోని పోలింగు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. నర్సాపూర్‌లోని పలు కౌంటర్లను తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు.

కుల వృత్తులవారి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కల్హేర్, నవంబరు 9; రాష్ట్రంలోని అన్ని రకాల కులవృత్తులను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులో శనివారం ఉచిత చేప పిల్లలను వదిలిపెట్టారు. అనంతరం ప్రాజెక్టు వద్ద జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని చెరువులు, కుంటల్లోనూ చేపలను పెంచడానికి ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు నాణ్యమైన ఉచిత చేపల పిల్లలను పంపిణీ చేసి, వాటికి మార్కెట్ సదుపాయం కల్పించడంతో పాటు వాహనాలను కూడా రాయితీపై అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల ఛైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరొరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నల్లవాగులో చేప పిల్లలను వదులుతున్న ఖేడ్ ఎమ్మెల్యే

- కంగ్టి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజుల్‌పాడ్‌లో శనివారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి సర్వేలో పాల్గొని పలు కుటుంబాల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలోడీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ అబ్దుల్ నజీంఖాన్, అధికారులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కచ్చితమైన సమాచారాన్ని సేకరించండి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజల నుంచి కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశంలో నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. సర్వే కోసం జారీ చేసిన బుక్‌లెట్‌లోని అంశాలపై ఎలాంటి సందేహాలకు తావు లేకుండా వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, డీఆర్డీవో జ్యోతి, మెప్మా పీడీ గీత, వ్యవసాయ శాఖజేడీ శివకుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు క్యాంపెయిన్ పరిశీలన

ఓటరు నమోదుకు రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించి పరిశీలించారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాల, మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, బీఎల్‌వోలు రజిత, నరసమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

మత్స్యకార్మికుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

అల్లాదుర్గం, నవంబరు 9.(ఆంధ్రజ్యోతి):మత్స్య కార్మికులు ఆర్థికాభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని మత్స్యశాఖ అధికారి భరత్, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకిషన్, చంద్రశేఖర్, నర్సింలు, సురేష్ తదితరలు అన్నారు. శనివారం మండలంలోని ముస్లాపూర్ పెద్దచెరువులో 96 వేల చేపపిల్లలను వదిలారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

రామాయంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రామాయంపేట మున్సిపల్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే చేసే ఎనిమినేటర్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 వార్డులకు గాను 28 మంది దీనిలో పాల్గొంటారు. ఈ మేరకు కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్ లు సర్వే ఫారాలను అందజేశారు. ఈ నెల 19 వ తేదీ వరకు సర్వే ప్రక్రియ కొనసాగనుందని తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



సంగారెడ్డిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. సంగారెడ్డి చౌరస్తాలోని పీఎం విశ్వకర్మ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు, వాడకం అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వాడకానికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయండి



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ జిల్లా కార్యదర్శి రాకేష్

మెదక్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేసి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమాన హక్కులు కల్పించేలా చూడాలని దేవాదాయ శాఖ, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖకు విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ జిల్లా కార్యదర్శి రాకేష్ వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన మంత్రిని కలిసి ఆర్టిజన్ల సమస్యలను వివరించారు. మంత్రి స్పందిసూ ఈ విషయంలో ఉప ముఖ్యమంత్రి ట్రాన్స్‌కో ఎండీతో చర్చిస్తున్నట్లు చెప్పారు.

శివారు డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి పటాన్‌చెరు ఎమ్మెల్యే విజ్ఞప్తి

పటాన్‌చెరు నవంబరు, 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని జీహెచ్ఎంసీ డివిజన్లలో మౌలిక వసతుల కోసం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీతో సమావేశమై సమస్యలపై చర్చించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లలో తాగునీటి వసతి, మురుగునీటి కాల్వలు, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లకు 13.20కోట్ల నిధులు అవసరమన్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీలతో పాటు పాత కాలనీలలో మురుగు కాల్వలను యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే తెలిపిన సమస్యలపై ఎండీ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయిస్తామని సానుకూలంగా హామీ ఇచ్చారు.

రిషి హైస్కూల్‌లో 'వెల్‌నెస్' హెల్త్ క్యాంపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని రిషి హైస్కూల్‌లో వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుమారు 350 మందికి పైగా విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ ఇతరత్రా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెల్‌నెస్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, వైద్యులు డా.హరిత, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమాజం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

జహీరాబాద్, నవంబరు 9: జహీరాబాద్ నియోజకవర్గం బ్రాహ్మణసేవా సమాజం సభ్యురాలిగా పనిచేస్తున్న సువర్ణ కులకర్ణి కూతురు దివ్య వివాహం ఈ నెల 8న సంగారెడ్డిలో నిర్వహించారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఈ విషయం తెలిసిన జహీరాబాద్ బ్రాహ్మణ సేవాసమాజం జిల్లాఅధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.21వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేసినట్లు జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు రాజ్‌కుమార్‌దేశ్ పాండె తెలిపారు.

మాలల పాదయాత్రను విజయవంతం చేయాలి

చేగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 25న చేపట్టే మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర పొలిట్ బ్యూరో ఛైర్మన్ ర్యాకాం శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం చేగుంట ఆర్అండ్‌బి గెస్టుహౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం ఆయా జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వేతీరును పర్యవేక్షించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ కుటుంబాల సమగ్రసమాచారాన్ని సేకరించి ఫారాల్లో నమోదు చేసుకున్నారు.



జహీరాబాద్: హుగ్గెల్లిలో నిర్వహించిన సర్వేలో వివరాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి తదితరులు



తూప్రాన్ మండలం ఇమాంపూర్‌లో ఫారాల్లో వివరాలు నమోదు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

సంగారెడ్డిలో..

జహీరాబాద్, నవంబరు 9: సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో జానకిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంతోపాటు, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లో సర్వే ప్రక్రియ కొనసాగింది. హుగ్గెల్లి, తదితర గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో జడ్పీ సీఈవో పాల్గొని సర్వేపనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. సిర్గాపూర్ మండలంలోని కడ్పల్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను సంగారెడ్డి జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సిర్గాపూర్‌లో సర్వేను ఎంఈవో నాగారం శ్రీనివాస్ పరిశీలించారు. వట్‌పల్లిలో నిర్వహించిన సర్వేను ఎంపీడీవో శశి ప్రభ పరిశీలించారు కార్యక్రమంలో ఎంపీవో ఖ్వాజ నసురుద్దీన్ పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి బలరాం, ఎంపీడీవో మహేశ్వర్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ శివరామక్రిష్ణ సందర్శించి, పరిశీలించారు. సర్వేలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తమ దృష్టికి తేవాలని సిబ్బందికి సూచించారు. మునిపల్లి మండలకేంద్రంతో పాటు బుదేరా తదితర గ్రామాల్లో సమగ్ర సర్వేను మండల స్పెషలాఫీసర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి పర్యవేక్షించారు. సర్వే విజయవంతం అయ్యేలా చూడాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. వారి వెంట ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, తహసీల్దార్ ఆశాజ్యోతి, డీటీ కృపానందం, ఎంపీవో అండాలమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే దరఖాస్తు ఫారాలు నింపడానికి కొంత సమయం తీసుకోవడంతో ఆలస్యం జరుగుతుందని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామంలో ఎన్యుమరేటర్ సర్వే చేస్తున్న తీరును ఆయన పర్యవేక్షించారు.సర్వేలో మొదట్లో ఫారాలు పూరించడానికి కొంత సమయం తీసుకున్నప్పటికీ, క్రమంగా సమయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, పంచాయతీ కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం రుస్తుంపేటతో పాటు పట్టణంలోని 4వ వార్డులో నిర్వహించిన ఇంటింటి సర్వే తీరును ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, జీడిపల్లి గ్రామాల్లో చేస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి. పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శులు రాజు, వేణుగోపాల్‌రెడ్డి, ఇతర సర్వే సిబ్బంది పాల్గొన్నారు. వెల్దుర్తి మండలంలో నిర్వహించిన సర్వేలో ఎంపీవో విఘ్నేశ్వర్ సిబ్బందితో పాటు సర్వేలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించారు.